పాత పంటల సంరక్షణే లక్ష్యం

హుస్నేల్లి, గుంజొట్టిలో పాతపంటల జాతర

హుస్నేల్లిలో ఎడ్ల బండ్లకు స్వాగతం పలుకుతున్న డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు

జహీరాబాద్, జనవరి 17 : కనుమరుగవుతున్న పాత పంటలను రక్షించి భావితరాలకు అందించడమే కాకుండా జీవ వైవిధ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని డెక్కన్ డెవలప్‌మెంట్ పాత పంటల జాతర కో-ఆర్డినేటర్లు వినయ్ కుమార్, మంజుల పేర్కొన్నారు. శుక్రవారం న్యాల్‌కల్ మండలంలోని గుంజొట్టి, హుస్నేల్లి గ్రామాల్లో 25వ పాతపంటల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో వారు మాట్లాడుతూ పాతపంటలైన తైదలు, కొర్రలు, సామెలు, రాగులు, అవిసలు, సజ్జ, జొన్న, పెసర, మినుము తదితర పంటలతో అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం భూసార పరీక్ష శాస్త్రవేత్త డాక్టర్ స్వామి మాట్లాడుతూ కాలానుగుణంగా మారుతున్న ఆహారపు అలవాట్లతో ప్రస్తుతం ప్రజలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ పాతపంటలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆనంతరం ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా పాతపంటల విత్తనాలతో అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపును నిర్వహించారు. ఆయా గ్రామాల్లో డీడీఎస్ మహిళ సంఘాల సభ్యులు, మహిళలు చేపట్టిన కోలాటం, చిటికెల రామాయణం, ఆట పాటలు ప్రజలకు ఎంతగానో అకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీడీఎస్ లైజర్ ఆఫీసర్ మాణిక్యం, మహిళ సంఘాల సభ్యులు నర్సమ్మ, చుక్కమ్మ, విజయలక్ష్మి, శ్రీలయ, బాలయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్యారానగర్‌కు డంపింగ్‌యార్డు వచ్చినట్లేనా ?

- గ్రేటర్ శివారులో నాలుగు కొత్త డంపింగ్‌యార్డుల ఏర్పాటుపై జీహెచ్ఎంసీ ఫోకస్
- ప్యారానగర్ అటవీప్రాంతంలో 125 ఎకరాలు
- దుండిగల్‌లో 85 ఎకరాలు
- లక్డారంలో వంద ఎకరాలు
- యాదాద్రి భువనగిరి జిల్లాలోని మల్కాపూర్‌లో 200 ఎకరాల్లో డంపింగ్ యార్డుల ఏర్పాటుపై కలెక్టర్లకు లేఖలు రాసిన జీహెచ్ఎంసీ కమిషనర్

ప్యారానగర్ అటవీప్రాంతంలో డంపింగ్‌యార్డు కోసం గుర్తించిన స్థలం

గుమ్మడిదల, జనవరి 17 : రాష్ట్రంలో కొత్తగా నాలుగు డంపింగ్‌యార్డులను ఏర్పాటు చేయడానికి జీహెచ్ఎంసీ కమిషనర్ కలెక్టర్లకు లేఖలు రాసినట్లు విశ్వసనీయ సమాచారం. హైదరాబాద్ నగరశివారులో నాలుగు ప్రాంతాల్లో కొత్తడంపింగ్ యార్డులు అందుబాటులోకి తీసుకురావడానికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లోని డంపింగ్‌యార్డును సందర్శించారు. అనంతరం నగరచుట్టూ డంపింగ్‌యార్డులను ఏర్పాటు చేయడానికి యోచిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీప్రాంతంలో 125 ఎకరాలను సందర్శించి త్వరలో డంపింగ్‌యార్డును అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు నియోజకవర్గంలోని లక్డారం వంద ఎకరాలను కూడా పరిశీలిస్తున్నారు. ప్యారానగర్‌లోని 125 ఎకరాల భూమిలో డంపింగ్‌యార్డు ఏర్పాటుపై కలెక్టర్ నుంచి అనుమతులు, పర్యావరణం, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు లభించినట్లు సమాచారం. కానీ, జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. డంపింగ్‌యార్డుకు సమీపంలో గ్రామాలు కూడా గతంలో డంపింగ్‌యార్డు వద్దంటూ గ్రామపంచాయతీల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేశాయి. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధి ఆగ్రామాల ప్రజలకు మద్దతుగా ప్యారానగర్ డంపింగ్‌యార్డు ఏర్పాటుకు అడ్డుపడుతున్నట్లు తెలిసింది. సంగారెడ్డి జిల్లా లక్డారంలో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు అనుమతి రావాల్సి ఉన్నది. దుండిగల్‌లో డంపింగ్‌యార్డుకు పీసీబీ అధికారుల నుంచి ఎన్‌వోసీ రావాల్సి ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు జీహెచ్ఎంసీ లేఖ రాసిందని పలువురు అధికారులు చెబుతున్నారు.

జవహర్‌నగర్‌లో పెరుగుతున్న చెత్తవ్యర్థాలు

జీహెచ్ఎంసీ పరిధిలో రోజుకు వెయ్యి టన్నుల చెత్తవ్యర్థాలు వెలువడుతున్నాయనేది అధికారుల సమాచారం. దీని భారం తగ్గించడానికి నగర నలుమూలల్లో డంపింగ్‌యార్డులను ఏర్పాటు చేస్తే కొంత చెత్తవ్యర్థాల కంపును నివారించవచ్చని అధికారులు ఆలోచిస్తున్నారు. తడి,పొడి చెత్త వ్యర్థాలను క్రమబద్ధీకరించడంతో పాటు చెత్త వ్యర్థాల నుంచి కంపోస్ట్ ఉత్పత్తి అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. దుండిగల్‌లో 85 ఎకరాల్లో ప్రస్తుతం ఉన్న వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటు ఓఆర్ఆర్‌కు సమీపంలో ఉండడం చేత డంపింగ్ యార్డుకు పీసీబీ బోర్డు అభ్యంతరం చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ కూడా పీసీబీ అధికారులు ఎన్‌వోసీ లభిస్తే దండిగల్‌లో మరో డంపింగ్‌యార్డుకు మార్గం సుగమం అవుతుంది. యాదాద్రిభువనగిరి జిల్లాలోని మల్కారం, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని లక్డారంలో కూడా డంపింగ్ యార్డుల నిర్మాణానికి ఆ జిల్లాల కలెక్టర్లకు జీహెచ్ఎంసీ లేఖ రాసింది. ప్రస్తుతం ప్యారానగర్‌లో జిల్లా అధికారుల నుంచి అనుమతులు రావడంతో ఇక్కడ కొత్తడంపింగ్‌యార్డుతో జవహర్‌నగర్‌కు చెత్తవ్యర్థాల భారం తగ్గనుందని జీహెచ్ఎంసీ అధికారులు ఆలోచిస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్/మనూరు, జనవరి 17 : నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి శుక్రవారం పలువురిని పరామర్శించారు. నారాయణఖేడ్ మండలం నమ్లిమేట్ గ్రామానికి చెందిన రామయ్య ఇటీవల మృతిచెందారు. వారి కుమారులు శ్రీమాన్, అబ్రం, కిరణ్‌లను పరామర్శించారు. మనూరు మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు విఠల్‌రెడ్డికి హార్ట్‌సర్జరీ కావడంతో ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన భాను ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో గాయలు కావడంతో పరామర్శించారు. ఆయనవెంట మనూరు మండలాధ్యక్షుడు విఠల్‌రావు, లక్ష్మారెడ్డి, సుదర్శన్ రెడ్డి, నాగ య్య, సందీప్ కుమార్, లింగయ్య, యాదగిరి, రాజేందర్‌రావు, గణపతి రావు, హరికృష్ణ ఉన్నారు.

వైభవంగా శ్రీవరసిద్ధివినాయక జయంతోత్సవాలు

జహీరాబాద్, జనవరి 17 : మండలంలోని హద్నూర్ గ్రామ శివారులో స్వయంభూ గా వెలిసిన శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి 225వ జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సంకటహర చతుర్థి సం దర్భంగా శుక్రవారం ఆలయ కమిటి అధ్యక్షుడు పునీత్ దీక్షిత్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, గణపతి హవనం, శత చండీహవనం, యజ్ఞహోమ పరిసమాప్తి, పూర్ణా హుతి, మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తొగుట పీఠాధిపతి మాధవనంద సరస్వతీ మహారాజ్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని రేజింతల్, చీకూర్తి గ్రామాల్లోని సిద్ధివినాయక ఆలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మహాసభలను జయప్రదం చేయాలి

జహీరాబాద్/హత్నూర, జనవరి 17 : ఈ నెల 25న జిల్లా కేంద్రమైన సంగారెడ్డి నిర్వహించే సీపీఎం నాలుగో రాష్ట్ర మహాభలను జయప్రదం చేయాలని సీపీఎం ఏరియా కార్యదర్శి బి.రాంచందర్ కోరారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని శ్రామిక భవన్ ఆవరణలో రాష్ట్ర మహాసభల సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. నాయకులు మహిపాల్, సలావుద్దీన్, నరేశ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు

జోగిపేటలోని వస్త్రదుకాణంలో అధికారుల తనిఖీలు

అందోల్, జనవరి 17 : చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని జిల్లా అధికారి యాదయ్య హెచ్చరించారు. శుక్రవారం జోగిపేట పట్టణంలో ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ దుకాణంలో చిన్నపిల్లాడు పనిలో ఉండడంతో యజమానిపై కేసు నమోదు చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దుకాణాలు, ఇతర పరిశ్రమల్లో తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు పకడ్బందీగా కృషిచేస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా చిన్నపిల్లలను పనిలో పెట్టుకుంటే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శివకుమార్, సిబ్బంది సూర్యకాంత్, సరళ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

అందోల్, జనవరి 17 : రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని తాలెల్మ శివారుల్లో శుక్రవారం చోటు చేసుకుంది. కిచ్చన్నపల్లి గ్రామానికి చెందిన సుధాకర్‌తో పాటు మరో వ్యక్తి బైక్‌పై తాలెల్మకు వెళ్తుండగా కిందపడి గాయాలయ్యాయి. సుధాకర్‌కు కాలు విరిగింది., మరో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సీఐ అనిల్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం

మునిపల్లి,జనవరి 17 : సీపీఎస్ ఉద్యోగుల జిల్లా ఉపాధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన బుధేరా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ముద్దం సిద్దారెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ అధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానిస్తున్న కళాశాల బృందం

మోడల్ ఇంటి నిర్మాణానికి స్థల పరిశీలన

జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చలపతి

న్యాల్‌కల్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చలపతి

జహీరాబాద్, జనవరి 17 : ఇందిరమ్మ ఇండ్ల సర్వే వెంటనే పూర్తి చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చలపతి మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో ఐకేపీ కార్యాలయ పరిధిలో మోడల్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 200 గజాల స్థలాన్ని మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా ఈ నిర్మాణాలను చేపడుతాయన్నారు. ఈ మాదిరిగానే మండలంలోని గ్రామాల్లో లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకోవాల్సి ఉంటుందన్నారు. ఆనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో మిగిలిపోయిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేనే వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మండల అభివృద్ధి అధికారి రాజశేఖర్, పంచాయతీ అధికారి సురేశ్, గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామి తదితరులు ఉన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

చౌటకూర్ : సుల్తాన్‌పూర్‌లో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

చౌటకూర్, జనవరి 17 : సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్, సరఫ్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం పథకాల అమలు కోసం చేపడుతున్న సర్వే బృందాల పనితీరును స్వయంగా పరిశీలించారు. అర్హులైన నిరుపేదలందరికీ లబ్ధి చేకూరే విధంగా చేపడుతున్న సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రతాకార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద అర్హులైన వారికి ప్రయోజనం కలుగాలన్నారు. కలెక్టర్ వెంట అందోలు ఆర్డీవో పాండు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి పావని తదితరులు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించాలి

జహీరాబాద్, జనవరి 17 : ప్రభుత్వ పథకాల కోసం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జానకీరెడ్డి, జహీరాబాద్ ఆర్డీవో రాం రెడ్డి అన్నారు. శుక్రవారం జహీరాబాద్ నియోజక వర్గంలోని మొగుడంపల్లి మండలంలోని ప్యారానగర్, మొగుడంపల్లి గ్రామాల్లో అధికారులు చేపడుతున్న ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా సర్వేలను పరిశీలించారు. ఆయా పథకాలకు అర్హులైన లబ్ధిదారులను పకడ్బందీగా గుర్తించాలని, అనర్హులను జాబితాలో చేర్చొవద్దని, చేరిస్తే పూర్తి బాధ్యత అధికారులదే అని పేర్కొన్నారు. జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల్లోని గ్రామా ల్లో రెవెన్యూ, వ్యవసాయాధికారులు సాగుకు యోగ్యంగానీ భూముల గుర్తింపు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపు కోసం ఇంటింటి సర్వేను చేపట్టారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

హత్నూరలో..

హత్నూర, జనవరి17 : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం హత్నూర మండలం గుండ్లమాచునూర్‌లో పర్యటించి నాలుగు పథకాలకు సంబంధించి చేపడుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైనవారికి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయభరోసా, రేషన్‌కార్డుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, ఎంపీడీవో శంకర్, ఎంపీవో యూసూఫ్, ఆర్ఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు సర్వేలో వేగం పెంచాలి

మునిపల్లి, జనవరి 17 : గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చేపడుతున్న రేషన్ కార్డుల సర్వేలో వేగం పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా తెలిపారు. శుక్రవారం మండలంలోని బుధేరా గ్రామంలో సంబంధిత అధికారులు చేపడుతున్న రేషన్ కార్డుల సర్వేను ఆకస్మికంగా సందర్శించారు. మండల పరిషత్ అధికారి హరినందన్‌రావు, ఎంపీవో అండాలమ్మ, బుధేరా పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

హత్నూర : గుండ్లమాచునూర్‌లో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలి

వెంకటాపూర్ గ్లోబల్ గ్రీన్ పరిశ్రమలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై గోపతి సతీశ్

కోహీర్, జనవరి 17 : చెడు అలవాట్లకు దూరంగా ఉన్నప్పుడే సురక్షితంగా ఉంటారని ఎస్సై గోపతి సతీశ్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్లోబల్ గ్రీన్ పరిశ్రమలో శుక్రవారం దక్కన్ టోల్‌వేస్ సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కార్మికులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, తదితర మత్తు పదార్థాలను విక్రయించినా, వినియోగించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పరిశ్రమ ప్రతినిధి నెహ్రూ రమేశ్, సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

పాల దిగుబడికి కృషిచేయాలి

అధిక పాలదిగుబడి సాధించిన రైతులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

హత్నూర, జనవరి 17 : పాడిపశువుల సంపదపెంచి పాలదిగుబడికి కృషిచేయాలని ఉమ్మడి జిల్లా ఈవో డాక్టర్ రాంజీ సూచించారు. శుక్రవారం హత్నూర మండలం చింతల్‌చెరులో పాలదిగుబడి అధికంగా సాధించిన రైతులకు బహుమతులు అందజేశారు. అనంతరం అయన మాట్లాడుతూ రోజురోజుకూ పాల వినియోగం పెరుగుతున్నదని ప్రజల అవసరాలకు అనుగునంగా నాణ్యమైన పాల ఉత్పత్తి పెంచేందుకు ఇంటింటికీ పశుసంపద పెంచుకోవాలని సూచించారు. మార్కెట్లో లభ్యమవుతున్న పాల నాణ్యత పరిశీలించి కల్తీలేని పాలను చిన్నపిల్లలకు తాపాలన్నారు. పశుసంపద పెంచడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారిని హేమలత, గోపాలమిత్ర సూపర్‌వైజర్ అర్జునయ్య, గోపాలమిత్రలు నాగేశ్, సుధాకర్, మోయినొద్దీన్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను విస్మరిస్తే ఉద్యమం తప్పదు

జోగిపేటలో మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

అందోల్, జనవరి 17 : ఆటో డ్రైవర్లను ప్రభుత్వం విస్మరిస్తే ఉద్యమం తప్పదని జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి హెచ్చరించారు. శుక్రవారం జోగిపేటలో తెలంగాణ బీఎంఎస్ అనుబంధ ఆటో, ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగులయ్య ఆధ్వర్యంలో భారీ సభ, ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వం వెంటనే ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మజ్దూర్ సంఘ్ ప్రతినిధులు హబీబ్, శ్రీధర్‌రెడ్డి, బీఎంఎస్ నాయకులు నరసింహారెడ్డి, మోహన్‌రెడ్డి, జోగిపేట ఆటోయూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

బీరప్ప బస్తీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి

జిన్నారం (బొల్లారం) జనవరి 17 : బొల్లారం మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు బీరప్ప బస్తీలో మున్సిపల్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీఆర్ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం బస్తీ వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు శారద, స్థానికులు సుధాకర్ రెడ్డి, కల్యాణ్ పాల్గొన్నారు.

అంతర్గత భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్

హుస్నాబాద్, జనవరి 17: బ్యాంకులు, ఫైనాన్స్‌లలో అంతర్గత భద్రతపై అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సతీశ్ వాసాల సూచించారు. శుక్రవారం హుస్నాబాద్ సర్కిల్ పోలీసు కార్యాలయంలో బ్యాంకు, ఫైనాన్స్ మేనేజర్లతో భద్రతా అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రతి బ్యాంకులో విధిగా సెక్యూరిటీ గార్డును నియమించుకోవాలని, అలారం సిస్టం పనిచేసే విధంగా చూసుకోవాలన్నారు. బ్యాంకు తలుపులు, కిటికీలను ప్రతి 15రోజులకు ఒకసారి చెక్‌చేసుకోవాలని సూచించారు. ప్రజలు దాచుకున్న డబ్బు, బంగారాన్ని కాపాడేందుకు బ్యాంకు అధికారులు, పోలీసులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. మెయిన్ బ్రాంచ్ నుంచి ఇతర బ్రాంచ్‌లకు డబ్బు తరలింపు సమయంలో తగినభద్రతా చర్యలు పాటించాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంకులో తారస పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ఖాతాదారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై తోట మహేశ్, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

అర్జున్‌పట్లలో ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి17: ఉమ్మడి మద్దూరు మండలంలోని అర్జున్‌పట్లలో లింగాల బాలయ్య, సింగపాక కుమార్, భీంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొల్పుల బాలరత్నం అనే రైతులకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీలను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రోజుమాదిరిగానే ట్రాక్టర్లను తమ వ్యవసాయ బావుల వద్ద పెట్టి ఇంటికి వచ్చామని, మరునాడు ఉదయం వెళ్లిచూడగా ట్రాక్టర్ల బ్యాటరీలు మాయమైనట్లు రైతులు వాపోయారు. ఇటీవల ఉమ్మడి మద్దూరు మండలంలో ట్రాక్టర్ బ్యాటరీలు వరుసగా చోరీ జరగడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు ఉన్నతాధికారులు బ్యాటరీల దొంగలను త్వరగా పట్టుకొని తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

కోతకు గురైన రహదారి

వావిలాల గ్రామ శివారులో కోతకు గురైన ప్రధాన రహదారి

జిన్నారం (బొల్లారం) జనవరి 17 : జిన్నారం మండలం వావిలాల గ్రామ శివారులోని ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. కొంత కాలంగా రోడ్డు కోతకు గురై ధ్వంసమైంది. దీంతో ఆ దారి గుండా రాత్రి వేళల్లో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు, బాటసారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వాహనదారులు, బాటసారులు కోరుతున్నారు.

గుమ్మడిదల తహసీల్‌ను సందర్శించిన ఆర్డీవో

గుమ్మడిదల, జనవరి 17 : మండల కేంద్రంలోని తహసీల్‌ను ఆర్డీవో రవీందర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మండల రెవెన్యూ శాఖ అధికారులతో రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల గురించి చర్చించారు. తహసీల్దార్ గంగాభవానీ, ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ శాఖ అధికారులు ఉన్నారు.

అమీన్‌పూర్‌లో కమిషనర్ పరిశీలన

అమీన్‌పూర్, జనవరి 17 : అమీన్‌పూర్ పట్టణ పరిధిలో రేషన్ కార్డుల జారీ కోసం విచారణ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ మేరకు సర్వే ప్రక్రియను కమిషనర్ జ్యోతిరెడ్డి, ఆరోవో మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. పట్టణ పరిధిలోని 24 వార్డుల్లో 987, ఇటీవల మున్సిపల్‌లో విలీనమైన పంచాయతీల నుంచి 285 దరఖాస్తులపై విచారణ చేస్తున్నామని కమిషనర్ తెలిపారు.

సర్వేను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి

ఆరోపణలపై డీపీఎం విచారణ

లింగాపూర్‌లో విచారణ చేస్తున్న డీపీఎం విద్యాసాగర్

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి17: ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామంలోని ఉజ్వల గ్రామైక్య సంఘంలో నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు ఖర్చుచేశారని, హమాలీ కార్మికులకు రావాల్సిన డబ్బులు ఇవ్వలేదని గ్రామానికి చెందిన గద్దల మహేందర్ ఐకేపీ ఉన్నతాధికారుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డీపీఎం విద్యాసాగర్ శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ 2012లో హమాలీ కార్మికుల కోసం ప్రభుత్వం చెల్లించిన డబ్బులతో తామంతా ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం కొంత భూమిని కొనుగోలు చేసినట్లు గ్రామస్తులు వివరించినట్లు తెలిపారు. కొన్నిమార్లు మార్కెట్ అవసరాల కోసం తీర్మానాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు డ్రా చేసినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 22న మరోమారు దీనిపై పూర్తిస్థాయిలో విచారించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి చంద్రయ్య, సందిటి లక్ష్మి, ముక్క కనకయ్య, సీసీలు మహేందర్, ప్రేమలత, సిద్ధిమల్లయ్య, నర్సయ్య, వీవో అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి కవిత, వీవోఏ వినోద, మహిళా సంఘాల నేతలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీ